క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

కొల్లూరు: నిరుద్యోగ యువత రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయాల అధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసకోవాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న కళాశాల ప్రాంగణంలో ఐటీసీ, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, ఎస్‌కే డిజిటల్స్, టాటా మెదలుగు కంపెనీలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలో పాల్గొంటున్నట్లు తెలిపారు. 10, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, ఆపైన విద్యార్హతలున్న విద్యార్థులు ఉద్యోగ మేళాలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9666545975 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గోల్డెన్ శాండ్స్ రిసార్ట్ ప్రారంభం

బాపట్ల: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఏపీ టీడీసీ చైర్మన్ బాలాజీలతో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్లలోని గోల్డెన్ శాండ్స్ రిసార్ట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. బాపట్ల మండలం పాండురంగపురం గ్రామ సమీపంలోని బాపట్ల గోల్డెన్ సాండ్ రిసార్ట్‌లో జరిగిన స్థానిక కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, ఇన్‌చార్జీ జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు. యాగంటి ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాగంటి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 147 గదులు, ఆధునిక 5 స్టార్ సదుపాయాలతో గోల్డెన్ శాండ్స్ నిలిచిందని తెలిపారు. రిసార్ట్ డైరెక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేడు ఫొటోగ్రఫీ ప్రదర్శన, సదస్సు

చుండూరు(వేమూరు): మండలంలోని మోదుకూరు గ్రామంలోని వేమన సాహిత్య వికాస భవనంలో ఆదివారం ఫొటోగ్రఫీ ప్రదర్శన సదస్సు నిర్వహించడం జరుగుతుందని వేమన సాహిత్య వికాస కమిటీ అధ్యక్షుడు సీతారామి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఆంధ్ర లయోలా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ముప్వ శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

డ్రగ్స్ రవాణా చట్టరీత్యా నేరం



నగరం: మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మార్చూరి శ్రీరామ్ ప్రసాద్ చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామ సచివాలయంలో శనివారం డ్రగ్స్, ఆలకహాల్ సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్ అమ్మకం, రవాణా, కొనుగోలు వంటి సమాచారం తెలిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం ఉంచుతామన్నారు. ఎస్ఐ విజయలక్ష్మి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే దోహదం

కొల్లూరు: భూ సరిహద్దు సమస్యలతో సతమతం అవుతున్న రైతులకు ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని చిలుమూరు, రావికంపాడు గ్రామాలలో మూడో విడత రీ సర్వేపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. వీఆర్‌ఓలు, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

అమర్తలూరు(వేమూరు): రైతులందరు తమ భూములను రీ సర్వే చేయించు కోవాలని తహసీల్దారు నెహ్రూబాబు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలో, గోవాడ గ్రామంలో రీ సర్వే గ్రామ సభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమానులు వారి భూముల వివరాలు నమోదు చేయించు కోవాలని ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు రాజా రమేష్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మహాలక్ష్మి అలంకరణలో జిల్లెళ్లమూడి అమ్మవారు




లలితా త్రిపుర సుందరీ అలంకరణలో కనకదుర్గా భవానీమాత



మోదుకూరు రామచౌడేశ్వర స్వామి దేవస్థానంలో...



చావలి వాలేశ్వర స్వామి దేవాలయంలో..



పాతనందాయపాలెం లక్ష్మీ గణపతి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణ

లలితా త్రిపుర సుందరీ.. నమోస్తుతే..!

బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల వ్యాప్తంగా శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం పలు ఆలయాలల్లో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

– బాపట్లటౌన్/కర్లపాలెం/వేమూరు/నగరం/కొల్లూరు

మహాలక్ష్మి అలంకారంలో కనకదుర్గమ్మ

కొల్లూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు భక్తులకు వివిధ రూపాలలో దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నారు. మండలంలోని ఈపూరు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శనివారం నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహాలక్ష్మి హోమం నిర్వహించిన ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.



కొల్లూరు మండలం ఈపూరులో మహాలక్ష్మీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు



పాతనందాయపాలెం పోలేరమ్మ ఆలయంలో లక్ష్మీదేవిగా..



కొల్లూరులో లలితా త్రిపుర సుందరీ దేవిగా..

భారతి సిమెంట్‌తో నాణ్యత, మన్నిక

నగరం: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తయారుచేసిన నాణ్యమైన భారతి సిమెంట్‌ను ఎంచుకోవాలని మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ పూల సురేష్ చెప్పారు. మండల కేంద్రమైన నగరంలో శనివారం సాయిగోపి ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ శాశ్వత భవన నిర్మాణాలకు అనుగుణంగా భారతి సిమెంట్ తయారుచేస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలం మన్నేవిధంగా పూర్తి నాణ్యతా ప్రమాణాలతో తయారుచేసిన సిమెంట్‌ను వినియోగించాలన్నారు. టెక్నికల్ ఆఫీసర్ భవానీశంకర్ మాట్లాడుతూ సిమెంట్ నాణ్యతను వినియోగదారులకు, తాపీ మేస్త్రీలకు వివరించే విధంగా నాణ్యతా పరీక్షలను భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం తాపీ మేస్త్రీ, కార్మికులకు రూ.లక్ష ఉచిత బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఎంటర్‌ప్రైజెస్ యజమాని సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీకి ఇన్సూరెన్స్ బాండ్ అందజేస్తున్న సురేష్, భవానీ శంకర్

ఘనంగా బెల్ టవర్ ప్రతిష్ట

చెరుకుపల్లి: ఏసు క్రీస్తు పరిశుద్ధ దేవాలయం నిర్మించి దానిని సుందరంగా అలంకరించుకు దైవ ప్రార్థనలు చేసుకోవటం గ్రామానికి దీవెనకరమని ఏఈఎల్‌సీ మాజీ సెక్రటరీ చిన్నం కిషోర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని పడమర గుళ్లపల్లిలో శనివారం దేవాలయ గోపుర(బెల్ టవర్) ప్రతిష్ఠిత కార్యక్రమం ఎమిరేట్స్, బిషప్ తూర్పు గుంటూరు సినడ్ రెవరెండ్ కూరాకుల రత్నమోహన్ అధ్యక్షతన సంఘ పెద్దలు, గ్రామస్తులు పండుగ వాతావరణంలో ప్రత్యేక ప్రార్థనల నడుమ జరుపుకొన్నారు. ముందుగా దైవ సేవకులను అంబేడ్కర్ సెంటర్ నుంచి చర్చి ప్రాంగణం వరకు భక్తి గీతాలు, మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం దేవాలయ గోపుర(బెల్ టవర్) ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, వివిధ ప్రాంతాల దైవ సేవకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నూతన చర్చి గోపురాన్ని (బెల్ టవర్) ప్రారంభిస్తున్న చిన్నం కిషోర్‌బాబు

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి టి.ఉమామహేశ్వరరావు

చెరుకుపల్లి(రేపల్లె): రాష్ట్రంలో కార్మికులకు పని గంటల పెంపుదల చేయడం దుర్మార్గమని కార్మికులందరికీ వేతనాలు అమలు చెయ్యాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అధ్యక్షతన రేపల్లె పట్టణంలో బస్‌స్టాండ్ వద్ద నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ఎర్ర జండాలు చేతబట్టి, డప్పు కళాకారులతో, కోలాట దళాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ బొమ్మ సెంటరులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులపై అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నిర్బంధాలను ప్రయోగిస్తున్నాయని, పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తూ కార్మికుల శ్రమను దోసుకుంటున్నాయని, 8గంటలు పనిని 13 గంటలకు కార్మికులకు ద్రోహం చేయటమేనని మండిపడ్డారు. కార్మికులు మేడే ద్వారా సాధించుకున్న ఎనిమిది గంటల పనికి తూట్లు పొడవటం అని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచకుండా అనేక ఆంక్షలు పెడుతూ కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తున్నారని కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ గంగయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రేఖ ఎలిజిబెత్, జిల్లా అధ్యక్షుడు కె.జాన్సీ, జిల్లా నాయకులు జె.ధర్మరాజు, తిరుమల రెడ్డి, కె.వసంతరావు, కె.శరత్ పాల్గొన్నారు.



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అంబేడ్కర్ విగ్రహాన్ని ఢీ కొన్న లారీ

చెరుకుపల్లిలో ఘటన



లారీ ఢీ కొనటంతో విరిగిపోయిన ఐరన్ నిచ్చెన

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రొయ్యల కంపెనీ లారీ ఢీకొట్టిన ఘటన శనివారం తెల్లవారుజాయున జరిగింది. వివరాల ప్రకారం.. చెరుకుపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అతి వేగంగా లారీ ఢీ కొనటంతో విగ్రహం చుట్టు పెట్టిన సిమెంటు దిమ్మెలు, విగ్రహం ఎక్కేందుకు వేసిన ఇనుప నిచ్చెన పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. దీంతో మండలంలోని అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు విగ్రహాన్ని సందర్శించి, రహదారి దిగ్బంధనం చేసి ఆందోళన నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న నగరం ఎస్ఐ బందెల భార్గవ్ చెరుకుపల్లి పోలీస్ సిబ్బందితో ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులకు సర్ది చెప్పటంతో ఆందోళన విరమించారు. అనంతరం లారీ యజమాని మండలంలోని దళిత పెద్దలతో మాట్లాడి జరిగిన విగ్రహం చుట్టుపక్కల బాగుచేయిస్తామని హామీ ఇవ్వటంతో వివాదం సద్దుమణిగింది.

బాలకృష్ణను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వేమూరు: అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, బాలకృష్ణ మానసిక స్థితిని అర్థం చేసుకుని వెంటనే ఆయన్ను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాలకృష్ణకి మతిపోయిందని, అందువల్లే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీలో ఆయన చేష్టలు చూసి పిచ్చి ముదిరినట్లు ప్రజలు రూఢీ చేసుకున్నారని, వెంటనే ఆయనను పిచ్చి ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్య సేవలు అందించాలని ఆయన కోరారు.

సైకో బాలకృష్ణను అసెంబ్లీలోకి అనుమతించవద్దు

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య

బాపట్ల: ప్రజాస్వామ్య దేవాలయాలుగా పిలిచే చట్టసభల్లోకి సైకో బాలకృష్ణవంటి వారికి అనుమతి ఇవ్వకూడదని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రథం బజారులో బాలకృష్ణ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. బాలకృష్ణ నిజమైన సైకో అని చల్లా దుయ్యబట్టారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని కోరారు. బాలకృష్ణ ఫ్లెక్సీలను తగలబెట్టడంపై టౌన్ సీఐ రాంబాబు చల్లా రామయ్యపై కేసు నమోదు చేశారు.



బాలకృష్ణ ఫ్లెక్సీలను తగలబెడుతున్న చల్లా రామయ్య

స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

రేపల్లె రైల్వే స్టేషన్ మాస్టారు టి.సతీష్

రేపల్లె: పర్యాటక స్థలాలను సందర్శించే వారికి అసౌకర్యం కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రేపల్లె రైల్వేస్టేషన్ మాస్టార్ టి.సతీష్ అన్నారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక స్థలాలైన హంసలదీవి, నిజాంపట్నం, దిండి, భట్టిప్రోలు బౌద్ధారామం, పుణ్యక్షేత్రాలైన మోపిదేవి, మోర్తోటలను సందర్శించేవారిని దృష్టిలో పెట్టుకుని రేపల్లె పురపాలక సంఘం అధికారులు, రైల్వే అధికారులు కలసి రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవా, స్వచ్ఛ ఉత్సవ్ నిర్వహించారు. అనంతరం పరిశుభ్రతపై స్టేషన్‌లో ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎ.రామచంద్రరావు, ఆర్పీఎఫ్ ఏఎస్సై జి.వెంకటప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

